క్లుప్తంగా

మహాధర్నాపై సదస్సు

కృష్ణలంక(విజయవాడతూర్పు): క్విట్ మోడీ-సేవ్ ఇండియా అనే నినాదంతో ఆగస్టు 9న జరిగే మహాధర్నాను సకల కార్మికులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జాతీయ కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఎ.గఫూర్, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వి.రాధాకృష్ణమూర్తి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.వి.నాగేశ్వరరావు, రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ శోభనాదీశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఇండియా జ్యూయలరీ ఫెయిర్



లబ్బీపేట(విజయవాడతూర్పు): అదితి ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో బృందావనకాలనీలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఇండియా జ్యూయలరీ ఫెయిర్ మగువలను విశేషంగా ఆకట్టుకుంటుంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఫెయిర్ శుక్రవారం ప్రారంభం కాగా, దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన డిజైనర్స్ తమ ఆభరణాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. జైపూర్, ముంబయ్, కోల్‌కత్తా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లలో పేరొందిన ఆభరణాల వ్యాపారులు ఈ మెగా ఫెయిర్‌లో పాల్గొన్నారు. వివాహాది శుభకార్యాలకు అవసరమైన అన్ని రకాల ఆభరణాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

జగనన్న సురక్ష పేదలకు రక్ష

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



సర్టిఫికెట్ అందజేస్తున్న దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జగనన్న సురక్ష పేదలకు రక్ష అని వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం ఏడో డివిజన్ పరిధిలోని సీఎస్ఐ స్కూల్ గ్రౌండ్ ఆవరణలో జరిగింది. ఏడో డివిజన్ పరిధిలోని 37, 39, 40 సచివాలయాలు, 6వ డివిజన్‌లో 38, 248 సచివాలయాల పరిధిలోని వలంటీర్లు సర్వే చేసి 930 మందికి మంజూరైన కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను దేవినేని అవినాష్ ఉచితంగా వారికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు చెప్పిన సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. ఇంకా ఏమైనా ఉంటే వాటి పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి సేవలను అందించడం లేదన్నారు. ఒక్క ఏపీలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. టీడీపీ మోసపూరిత హామీలను ఎవ్వరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ నగరాభివృద్ధి జరగలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రచారానికి వచ్చే టీడీపీ నాయకులను ప్రజలు నాటి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం ఎందుకు చేయలేదని నిలదీయాలని అవినాష్ అన్నారు.

డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్‌లీడర్ సత్యనారాయణ, కార్పొరేటర్లు అమర్‌నాథ్, మాధురి, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజ, డివిజన్ ప్రెసిడెంట్లు అబ్బినాయుడు, సంపత్, నాయకులు తాళ్లూరి ఉదయ్, జంపాని సాయి నాయకులు పాల్గొన్నారు.

చాలా ఆనందంగా ఉంది



గతంలో కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే ప్రభుత్వం కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు ప్రభుత్వం అన్ని సేవలను సచివాలయంలోనే అందిస్తోంది. వలంటీర్లు ఇంటికి వచ్చి ఏదైనా సర్టిఫికెట్ కావాలా అని అడిగి మరీ ఇస్తున్నారు. ఇప్పుడు ఇంటి ముంగిటకు తీసుకువచ్చి సర్టిఫికెట్ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

–వి.బాబూరావు, 6వ డివిజన్

ఉచితంగా సర్టిఫికెట్ ఇవ్వడం సంతోషం



జగనన్న సురక్షలో భాగంగా మాకు ఎంతో ఉపయోగకరమైన సర్టిఫికెట్లను ఉచితంగా ఇవ్వడం చాలా సంతోషంగా ఉది. నేనే మా అమ్మాయి కళాశాలలో ఇవ్వడానికి ఇన్‌కమ్ సర్టిఫికెట్ తీసుకున్నాను. సర్టిఫికెట్ కావాలని అడిగిన వెంటనే దరఖాస్తు చేయించారు. సచివాలయం సిబ్బంది సర్టిఫికెట్ అందజేశారు.

–కె.పద్మ, ఏడో డివిజన్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

లబ్బీపేట(విజయవాడతూర్పు): వానలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. ఆమె శుక్రవారం నగరంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలు పరిశీలించారు. కొత్తపేట కొండ ప్రాంతాల్లో, వాగు సెంటర్‌లోని పోతిన ఆదియ్య సచివాలయం 165 పరిసరాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. ఇంటి ఆవరణలో నీరు నిలవకుండా చూడాలని అవగాహన కలిగించారు. అనంతరం చిట్టినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల నిర్వహణ, ఆయుష్మాన్ భారత్ నమోదు సంఖ్యలు, ల్యాబ్ పరీక్షల నిర్వహణ, మందులు అందుబాటు వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం డెంగ్యూ మాసోత్సవం పురస్కరించుకుని జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ సురేష్, వైద్యాధికారులు డాక్టర్ సునీల్, డాక్టర్ లలిత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'గడప గడప'లో ప్రజా సంక్షేమం



గడప గడపకు మన ప్రభుత్వంలో అవినాష్

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం 12వ డివిజన్, 51వ సచివాలయం శివాజీ రోడ్, అయ్యప్ప నగర్ మెయిన్ రోడ్ ప్రాంతాల్లో జరిగింది. సంక్షేమ లబ్ధి అందుకొన్న ప్రతి కుటుంబాన్ని అవినాష్ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం ద్వారా వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ లబ్ధి వివరాల కరపత్రాలు అందజేసి ఆ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అవినాష్ మాట్లాడుతూ 12వ డివిజన్లో మెయిన్ రోడ్డు, సీసీ రోడ్లు, వాటర్ లైన్లకు శంకుస్థాపన చేసి ప్రారంభించామన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చొరవతో డివిజన్‌లో దాదాపు రూ.6 కోట్లను వెచ్చించి అభివృద్ధి పనులు చేశామన్నారు. అయ్యప్ప నగర్ మెయిన్ రోడ్డు రూ.60 లక్షలతో డ్రైన్ టు డ్రైన్ వేశామన్నారు. గత ప్రభుత్వంలో స్థానికంగా టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ, కార్పొరేటర్ ఉండి కూడా ఐదేళ్లు డివిజన్‌ను పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, డివిజన్ ఇన్‌చార్జి మాగంటి నవీన్, వైఎస్సార్ సీపీ నాయకులు ధనేకుల కాళి, చిన్న, బషీర్, ఉస్మాన్, శ్రీను పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనలో రోటరీ సేవలు ప్రశంసనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న న్యాయమూర్తి తిరుమల వెంకటేశ్వర్లు

గుణదల(విజయవాడ తూర్పు): పోలియోను నిర్మూలించడంలో రోటరీ సేవలు ప్రశంసనీయమని విజయవాడ నాలుగో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి తిరుమల వెంకటేశ్వర్లు అన్నారు. 81వ రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ 2023–24 సంవత్సరం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం గుణదల ఈఎస్ఐ రోడ్డులోని పింగళి వెంకయ్య రోటరీ ప్లాటినం జూబ్లీలో జరిగింది. న్యాయమూర్తి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సామాజిక సేవలో ముందంజలో ఉందన్నారు. క్లబ్ నూతన అధ్యక్షులు డాక్టర్ కంచర్ల రవికుమార్ మాట్లాడుతూ సభ్యుల భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాలు ముందుకు నడిపిస్తానన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ప్రోగ్రాం కమిటీ చైర్మన్, సీనియర్ న్యాయవాది రోటేరియన్ చంటిరాజు నూతన సంఘ ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ 3020 జిల్లా గవర్నర్ ఆర్వీ సుబ్బారావు పాల్గొన్నారు.

'గణితం'తో ఉన్నత శిఖరాలు

గుణదల(విజయవాడ తూర్పు): గణితశాస్త్రాన్ని కష్టపడి, ఇష్టపడి అధ్యాయనం చేస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని లయోల కళాశాల పూర్వవిద్యార్థి, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిటైర్డ్ ఉన్నతాధికారి జొన్నలగడ్డ రాజేంద్ర అన్నారు. గణిత శాస్త్రం ప్రాముఖ్యతపై ఆంధ్ర లయోల కళాశాలలో శుక్రవారం అతిథి ఉపన్యాసం జరిగింది. రాజేంద్ర మాట్లాడుతూ దేశభక్తి, మానవతా విలువలను నేటి విద్యార్థులు నేర్చుకోవాలని సూచించారు. లయోల కళాశాల విద్యార్థులుగా సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. అనంతరం రాజేంద్రను కళాశాల యాజమాన్యం శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల రెక్టర్ ఫాదర్ బాలశౌరి, ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రభుదాస్, ఫాదర్ కిరణ్‌కుమార్, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పరుచూరి వేణుగోపాలరావు, అధ్యాపకులు డాక్టర్ తభిత, కె.నాగకోటేశ్వరరావు పాల్గొన్నారు.

లబ్బీపేటలో మలేరియా జిల్లా లేబొరేటరీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): మలేరియా జిల్లా లేబొరేటరీని లబ్బీపేట బృందావనకాలనీ నందమూరి రోడ్డులోని మలేరియా కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ జిల్లా లేబొరేటరీ మచిలీపట్నంలో ఉండేది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ప్రతి జిల్లాకు ఒక లేబొరేటరీ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

దీంతో ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి లేబొరేటరీని లబ్బీపేట మలేరియా కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇప్పటి వరకూ నిర్వహించిన మలేరియా యూనిట్ 2ను కృష్ణలంక భ్రమరాంబపురానికి తరలించారు. ప్రస్తుతం లబ్బీపేట మలేరియా యూనిట్ 2 పరిధిలో జీరో మలేరియా కేసులు ఉన్నాయి. కృష్ణలంక భ్రమరాంబపురంలో అక్కడక్కడా మలేరియా పాజిటివ్ కేసులతో పాటు, ఫాల్సీఫారమ్(పీఎఫ్) కూడా నమోదవుతుండటంతో ఆ ప్రాంతంలో మలేరియా యూనిట్ అవసరమని భావించి అక్కడికి లబ్బీపేట యూనిట్‌లు తరలించారు. అయితే ఇప్పటికే టెంపరరీ యూనిట్ నడుస్తుండగా, దానిలో ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నాడు. లబ్బీపేటలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్ ఇక్కడే పనిచేసేలా ఆదేశాలు ఇవ్వనున్నట్లు సంబంధిత జిల్లా మలేరియా అధికారి తెలిపారు.

మద్యం మత్తులో పాకకు నిప్పు

గుణదల(విజయవాడ తూర్పు): గుణదల పడవల రేవు ప్రాంతంలో మద్యం మత్తులో పాకకు నిప్పు పెట్టడంతో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. గుణదల పడవల రేవు ప్రాంతంలో ఓ ఖాళీ స్థలంలో ఇటుక, ఇసుక విక్రయిస్తుంటారు. ఈ కార్యకలాపాల కోసం ఆ స్థలంలోనే చిన్నపాక ఉంది. ఆ స్థలం వద్ద రోజూ రాత్రి వేళ కొందరు మద్యం సేవిస్తుంటారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో అక్కడ మద్యం సేవిస్తున్న వారిలో ఓ యువకుడు ఆ మత్తులో ఆ పాకకు నిప్పు పెట్టాడు. మంటలు బాగా రేగడంతో స్థానికులు ఆందోళన చెందారు. పాకకు నిప్పు పెట్టిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

నేడు ప్రత్యేక ప్రసంగాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ సి.రాఘవాచారి మీడియా అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న డిప్లొమో కోర్సు ఇన్ జర్నలిజంలో భాగంగా శనివారం వర్చువల్ విధానంలో ప్రత్యేక ప్రసంగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ది హిందూ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ అప్పాజీ రెడ్డెం ఆన్‌లైన్‌లో హాజరై జర్నలిజం–కాలానుగుణ మార్పుల ఆవశ్యకతపై, 9 నుంచి 10 గంటల వరకు సంపూర్ణ ఆహారం–మెరుగైన జీవనం పై శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని మాట్లాడతారని పేర్కొన్నారు. జర్నలిజం డిప్లొమో కోర్సు చేస్తున్న వారితో పాటుగా ఆసక్తి ఉన్న జర్నలిస్టులు పాల్గొనవచ్చన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగం అభివృద్ధి, వైద్య కళాశాలల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై వైద్యులు, వైద్య విదార్థులకు సదస్సులు నిర్వహించి అవగాహన కలిగిసున్నామని చెప్పారు. అందులో భాగంగా ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పలు వైద్య కళాశాలలు సందర్శించామని తెలిపారు. సీఎం జగన్ చిత్తశుద్ధి, అంకితభావంతో వైద్య రంగం, ప్రజారోగ్య విభాగంలో చేపట్టిన వినూత్న, విప్లవాత్మక కార్యక్రమాలను వివరిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వైద్యులు, వైద్య, పారా మెడికల్ విద్యార్థులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకూ వైద్య రంగంలో 47 వేలకు పైగా పోస్టులు భర్తీ చేయడమే కాక, రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేస్తున్నామన్నారు.

ప్రణాళికతో చదివితే విజయమే

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రణాళికతో చదివితే విజయం పొందవచ్చని సీనియర్ లీగల్ ఎఫైర్స్ అడ్వైజర్ ఫర్ యూఎస్ స్టేట్ సి.సౌమ్య చెప్పారు. జమ్మిచెట్టు సెంటర్ సమీపంలోని శారద కళాశాల విద్యార్థులకు శుక్రవారం కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్‌బాబు, కళాశాల ఎండీ వై.శారదాదేవి, కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, కళాశాల జనరల్ మేనేజర్ జీవీ రావు తదితరులు పాల్గొన్నారు.